ప్రయోగ పరీక్షలు ఎలా..?



ఇంటర్ సెకండియర్ సైన్స్ విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు ప్రాక్టికల్స్ తప్పనిసరి. అయితే మూడేళ్లుగా కళాశాలలకు రసాయనాల సరఫరా నిలిచిపోవడంతో ప్రయోగ తరగతులు అరకొరగానే నిర్వహిస్తున్నారు. 11లో▸

22న మహాచండీ యాగం

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ నాల్గో తరగతి ఉద్యగుల కేంద్ర సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న హైదరాబాద్‌లోని సంఘ కార్యాలయ భవనంలో మహాచండీ యాగం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధర్ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/17.0

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. వేకువజామున పొగమంచు ప్రభావం కొనసాగనుంది.

న్యూస్‌రీల్

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



జిల్లా జడ్జికి పూల మొక్క అందజేస్తున్న ఎస్పీ

ఆదిలాబాద్‌టౌన్:ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన గౌస్ ఆలం బుధవారం జిల్లా జడ్జి డాక్టర్ సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్, ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి పి.శివరాం ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సాయంత్రం కోర్టు ప్రాంగణానికి వెళ్లిన ఎస్పీ వారిని కలిసి పూల మొక్కలు అందజేశారు. జిల్లాలోని వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై ఈ సందర్భంగా వారితో చర్చించారు.

లారీ డ్రైవర్ల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న లారీడ్రైవర్లు

కైలాస్‌నగర్: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆదిలాబాద్ లారీ డ్రైవర్స్, క్లీనర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో పనిచేసే లారీ డ్రైవర్లపై కఠినంగా వ్యవహరించేలా కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని తీసుకురావడం సరికాదన్నారు. దీంతో డ్రైవర్ల బతుకులు రోడ్డున పడే ప్రమాదముందన్నారు. కేంద్రం పునరాలోచించి ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలిసి తమ డిమాండ్లతో కూ డిన వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘం నాయకులు షఫీఉల్లాఖాన్, మహ్మద్ అక్సర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్: ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో హెవీ మోటర్ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిపో మేనేజర్ కల్పన ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి 1 నుంచి ప్రారంభమై 30 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. ఫీజుగా రూ.15,600 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్నవారు అర్హులని తెలిపారు. వివరాలకు ఆదిలాబాద్ డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.కె యూసఫ్ 73828 40349 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లా నాయకులు



మాట్లాడుతున్న నరేశ్ జాదవ్

కైలాస్‌నగర్: తెలంగాణ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం హైదరాబాదులోని గాంధీభవన్‌లో బుధవారం నిర్వహించారు. టీపీసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆదిలాబాద్ పార్లమెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ నరేశ్ జాదవ్, నాయకురాలు రాథోడ్ పార్వ తి పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయ యాత్ర ఉద్దేశం, లక్ష్యాన్ని ప్రతీ గిరిజన కుటుంబానికి చేరవేయడం, రానున్న ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం గిరిజన విభాగం పోషించాల్సిన పాత్రపై ఇందులో మార్గనిర్దేశం చేసినట్లుగా నరేశ్ జాదవ్ తెలిపారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: నూతన సంవత్సరం పురస్కరించుకుని జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు బుధవారం కలెక్టర్ రాహుల్ రాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ చాంబర్‌లో కలిసి పూలమాల, శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీసీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు మేకల అశోక్, అంజయ్య, కార్తీక్,శ్రీనివాస్ తదితరులున్నారు.

ఆరంభం అదిరే..



సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థులు



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న క్రీడాకారులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



జెండా ఊపి పరుగు పందెం ప్రారంభిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

సాక్షి,ఆదిలాబాద్: క్రీడా సంబురం మొదలైంది. ఉట్నూర్ వేదికగా ఇంటర్ సొసైటీ లీగ్ (ఐఎస్ఎల్) రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐటీడీఏలోని కుమురంభీమ్ ప్రాంగణ మైదానాల్లో మూడు రోజుల పాటు కొనసాగనున్నాయి. రాష్ట్రంలోని ఏడు సొసైటీలకు చెందిన క్రీడాకారులు ఇందులో పాల్గొంటున్నారు. ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్ పోటీలను అట్టహాసంగా ప్రారంభించారు. ఆయా జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు సొసైటీల వారీగా మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. 13 విభాగాల్లో పోటీలు నిర్వహిస్తుండగా.. 3,500 మంది క్రీడాకారులు, కోచ్‌లు, రెఫరీలు హాజరయ్యారు.

- వివరాలు 10లో▸

మెనూ..!

- 'మధ్యాహ్న భోజనం'లో గుడ్డు మాయం
- చుక్కలనంటుతున్న నిత్యావసరాల ధరలు
- రూ.7కు చేరిన కోడి గుడ్డు ధర
- విద్యార్థులకు అందని పౌష్టికాహారం

కేటగిరి	పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక	925	46,344
ప్రాథమికోన్నత	111	25,122
ఉన్నత	110	12,089



మధ్యాహ్న భోజనం వండుతున్న నిర్వాహకురాలు(ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: మధ్యాహ్న భోజనానికి ధరాఘాతం ఏర్పడింది. నిత్యావసరాల ధరలు చుక్కలనంటుతుండగా ఈ జాబితాలో కోడి గుడ్డు చేరింది. ఫలితంగా వారానికి మూడు రోజులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో అందించాల్సిన గుడ్డు మాయవుతుంది. దీంతో చిన్నారులకు పౌష్టికాహారం అందించాలనే సర్కారు లక్ష్యం నీరుగారుతోంది. మరోవైపు బిల్లులందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నట్లు మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చెబుతున్నారు. అప్పులు చేసి మరీ పిల్లలకు భోజనం వండి పెడుతున్నట్లు పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

గుడ్డు వడ్డించలేం..

కోడిగుడ్డు ధర మార్కెట్‌లో మండుతుంది. మధ్యాహ్న భోజనంలో అందించే ఒక్కో గుడ్డుకు ప్రభుత్వం రూ.5 చెల్లిస్తుండగా బహిరంగ మార్కెట్‌లో రూ.6 నుంచి రూ.7వరకు పలుకుతుంది. మెనూ ప్రకారం వారానికి మూడు రోజులు గుడ్డు అందించాలి. అయితే రోజుకు ఒక గుడ్డుపై రూ.2 అదనపు భారం పడుతుండడంతో కార్మికులు బెంబేలెత్తిపోతున్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల నిర్వాహకులకు ఇది భారంగా మారింది. దీంతో చాలా చోట్ల వారానికి ఒక్క రోజుతోనే గుడ్డును సరిపెడుతున్నారు. తక్కువ మంది పిల్లలున్న పాఠశాలల్లో అతి కష్టం మీద రెండు రోజులు అందిస్తున్నారు. అయితే గుడ్డుకు బదులు ఒక్కో అరటి పండు విద్యార్థులకు ఇస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

పెరిగిన నిత్యావసరాల ధరలు..

గుడ్డు ధర పక్కన పెడితే నిత్యావసరాల ధరలు సైతం ఆకాశాన్ని అంటుతున్నాయి. మూడు నెలల కోసారి, ఆరు నెలల కోసారి బిల్లులు రావడంతో ఎండీఎం నిర్వాహకులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. కందిపప్పు, పెసరుపప్పుతో పాటు



భోజనం చేస్తున్న విద్యార్థిని (ఫైల్)

కూరగాయల ధరలు అధికంగానే ఉన్నాయి. అలాగే ఉదయం విద్యార్థులకు రాగి జావ సైతం అందిస్తున్నారు. గత ఆగస్టు నుంచి ఒకటి నుంచి 8వ తరగతుల విద్యార్థుల కుకింగ్ కాస్ట్ ఇప్పటి వరకు చెల్లించలేదు. ఆరు నెలలుగా బిల్లుల కోసం కార్మికులకు ఎదురుచూపులు తప్పడం లేదు. నవంబర్ నుంచి ఇప్పటి వరకు తొమ్మిది, పది తరగతుల విద్యార్థుల కుకింగ్ కాస్ట్ చెల్లించాల్సి ఉంది. దీనికి తోడు గుడ్డు బిల్లులు సైతం పెండింగ్‌లో ఉన్నాయి. ఫలితంగా భోజనం అందించడం నిర్వాహకులకు పెను భారంగా మారుతోంది.

అధికారుల పర్యవేక్షణ లోపంతో...

మధ్యాహ్న భోజన పథకాన్ని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడితో పాటు మండల విద్యాధికారులు, సెక్టోరియల్ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. వీరి పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో విద్యార్థులకు నాసిరకం భోజనం అందుతుందనే విమర్శలున్నాయి. టమాట చారు, కిచిడీతోనే సరిపెడుతున్నారు. ఆకు కూరలు, కూరగాయల భోజనం కానరావడం లేదు. గుడ్డు కూడా సరిగా ఇవ్వడం లేదు. బిల్లులు సక్రమంగా రాకపోవడంతో అధికారులు సైతం వారిని ఏమి అనలేని పరిస్థితి. ఈ ప్రభావం విద్యార్థులపై పడుతుంది. దీంతో చాలా మంది విద్యార్థులు ఇంటి వద్దకే భోజనానికి వెళుతుండగా పట్టణాల్లో ఇంటి నుంచే టిఫిన్ బాక్స్‌లు తెచ్చుకుంటున్నారు. మరి కొంత మంది విద్యార్థులు అర్ధాకలితో కొట్టుమిట్టాడాల్సిన దుస్థితి.

బిల్లుల పెండింగ్ వాస్తవమే

బడ్జెట్ లేకపోవడంతో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. బిల్లులు వచ్చిన వెంటనే చెల్లిస్తాం. నిర్వాహకులు మాత్రం మెనూ ప్రకారం భోజనం అందించాలి. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పౌష్టికాహారం అందేలా చూడాలి. దీనిపై ఎంఈవోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. – ఎం.ప్రణీత, డీఈవో

ఇబ్బందులు పడుతున్నాం



నిత్యావసరాలతో పాటు కోడిగుడ్ల ధర అమాంతం పెరగడంతో ఆర్థికంగా తీవ్ర భారంగా మారింది. దీనికి తోడు నెలల తరబడి బిల్లులు రావడం లేదు. పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి. పెరిగిన ధరలకనుగుణంగా ఎండీఎం ధరలను సైతం పెంచాలి. రెగ్యులర్‌గా బిల్లులు అందించేలా చూడాలి. – విమల, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు

ఇక పరిశీలనే..

- ముగిసిన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ
- పెండింగ్‌లో 47 దరఖాస్తులు
- ప్రభుత్వ మార్గదర్శకాల కోసం ఎదురుచూపు
- అభయహస్తం దరఖాస్తుల ప్రగతి తీరిది



ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ఆపరేటర్లు(ఫైల్)

కైలాస్‌నగర్: అభయహస్తం ఆరు గ్యారంటీల సంక్షేమ ఫలాలను అర్హులైన వారికి అందించేలా ప్రభుత్వం ప్రజాపాలన ద్వారా స్వీకరించిన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ గడువు బుధవారంతో ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 2,30,610 దరఖాస్తులు అందగా నిర్ణీత గడువులోపు 2,30,563 దరఖాస్తులతో కూడిన సమస్త సమాచారాన్ని ప్రజాపాలన వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. వివిధ కారణాలతో కేవలం 47 దరఖాస్తుల సమాచారం మాత్రమే పెండింగ్‌లో ఉంది. ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ ముగియడంతో అందరి దృష్టి ఇక క్షేత్రస్థాయి పరిశీలనపై ఉంది. అయితే ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి స్పష్టమైన మార్గదర్శకాలు రాలేదు. రెండు, మూడు రోజుల్లో ఉత్తర్వులు వచ్చే అవకాశముందని వాటి ప్రకారం అర్హుల ఎంపికకు సర్వే చేపడుతామని అధికారులు చెబుతున్నారు.

12 మండలాల్లో వందశాతం..

అభయహస్తం ఆరు గ్యారంటీల కోసం ప్రభుత్వం గతేడాది డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. జిల్లాలో మొత్తం 2,30,610 దరఖాస్తులు అందాయి. వాటికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఈనెల 7 నుంచి ప్రజా పాలన అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు ప్రక్రియ చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా 634 మంది కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు జిల్లా కేంద్రంలోని పలు శాఖల కార్యాలయాల్లో పది రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగింది. నిర్ణీత గడువు ముగిసే వరకు 2,30,563 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. జిల్లాలోని 12 మండలాల్లో వందశాతం విజయవంతంగా పూర్తి చేశారు. మరో ఐదు మండలాలు, ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో వివిధ కారణాలతో ఇంకా 47 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో ఆధార్ కార్డులను జత చేయకపోవడం, మొబైల్ నెంబర్లు ఇవ్వకపోవడం, అసలు ఆధార్ లేకపోవడం వంటి కారణాలు ఉన్నాయి. జైనథ్ మండలంలో మూడు దరఖాస్తులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు దరఖాస్తు చేయగా ఒకరు పింక్ కార్డు దారు అప్లై చేశారు. అత్యధిక ఇంద్రవెల్లిలో పెండింగ్‌లో ఉన్న 34 దరఖాస్తుల్లో అర్హులైన వాటిని మాత్రం అధికారిక వెబ్‌సైట్ సర్వర్ వచ్చిన వెంటనే వివరాలు నమోదు చేస్తామని అధికారులు చెబుతున్నారు.

మిగిలిన క్షేత్రస్థాయి పరిశీలన

ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ ముగిసింది. ఇందులో అర్హులైన వారి గుర్తింపు కోసం క్షేత్రస్థాయిలో పరిశీలన జరపాల్సి ఉంటుంది. అయితే ఇందుకు సంబంధించి ఇప్పటి దాకా ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు అందలేదు. అభయహస్తం ఐదు గ్యారంటీలకు అర్హుల ఎంపిక చేపట్టాల్సి ఉండగా దాన్ని ఏ ప్రతిపాదికన చేపడుతారనేదానిపై ప్రభుత్వం ఎలాంటి స్పష్టత నివ్వలేదు. ఆయా స్కీంలకు సంబంధించిన విధి విధానాలు ఖరారు చేశాకే ప్రభుత్వం నుంచి క్షేత్రస్థాయి పరిశీలన ఆదేశాలు అందుతాయని అధికారులు చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయి పరిశీలన గతంలో గృహలక్ష్మి మాదిరిగా పంచాయతీ కార్యదర్శుల ద్వారానే చేపడుతారా లేదంటే ప్రత్యేకంగా ఉద్యోగులను నియమించి పరిశీలిస్తారా అనేదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ఆయా పథకాలను ప్రభుత్వం తమకు ఎప్పుడు అందిస్తుందా అనేదానిపై ఆశావహులు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం స్పష్టమైన విధి విధానాలు ఖరారు చేస్తే తప్ప ఎంతమందికి లబ్ధి చేకూరుతుంది, ఆ అదృష్టవంతులెవరనేది తేలనుంది.

మండలం	దరఖాస్తులు	నమోదుచేసినవి	పెండింగ్
ఆదిలాబాద్‌రూరల్	12,428	12,428	00
బజార్‌హత్నూర్	9,563	9,563	00
బేల	13190	13,190	00
భీంపూర్	8,096	8,096	00
బోథ్	15,101	15,101	00
గాదిగూడ	6,844	6,844	00
గుడిహత్నూర్	10,350	10,350	00
ఇచ్చోడ	14,007	14,005	02
ఇంద్రవెల్లి	12,522	12,488	34
జైనథ్	17,310	17,303	07
మావల	1,809	1,809	--
నార్నూర్	9,175	9,175	00
నేరడిగొండ	9,681	9,681	00
సిరికొండ	5,778	5,776	02
తలమడుగు	11,706	11,705	00
తాంసి	5,707	5,707	00
ఉట్నూర్	18,906	18,906	00
ఆదిలాబాద్ మున్సిపాలిటీ	48,437	48,436	01

22న ఇంటింటా దీపాలు వెలిగించాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



శ్రమదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: అయోధ్య శ్రీరామ జన్మభూమిలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ కోరారు. జిల్లా కేంద్రంలో గల సీసీఐ పరిశ్రమలోని శ్రీరామాలయంలో బుధవారం శ్రమదానం నిర్వహించారు. అనంతరం జీఎస్ ఎస్టేట్ హౌసింగ్ సొసైటీ సహకారంతో చేపడుతున్న ఆలయ పునరుద్ధరణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనవరి 22న నిర్వహించనున్న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం రోజున ప్రతి ఒక్కరూ దీపావళి జరుపుకోవాలన్నారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు ప్రతీ ఇంటిలో దీపాలు వెలిగించాలని కోరారు. అయోధ్య రామ మందిర నిర్మాణంపై ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా, రామ మందిరాన్ని బీజేపీ హయంలో సగర్వంగా ప్రారంభించుకుంటున్నామన్నారు. హిందూ బంధువులందరి ఐక్యతతో ఈ మహత్కార్యం నెరవేరిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జోగు రవి, అంకత్ రమేష్, రాళ్ల బండి మహేందర్, లాలామున్న, రమేష్, సతీష్, కృష్ణ, సంతోష్, సాయి, రాము, సూర్యకిరణ్, రాకేష్, సురేందర్, శివ, గోపి తదితరులున్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగేనా..?

- మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు బేఖాతర్
- ముమ్మరంగా మడిగెల పనులు



అక్రమంగా చేపట్టిన మడిగెల్లో చేపడుతున్న ఫ్లోరింగ్ పనులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణం న్యూహౌసింగ్ బోర్డు పరిధి కేసీబీ గార్డెన్ సమీపంలో గల బల్దియా స్థలంలో అక్రమంగా చేపట్టిన మడిగెల నిర్మాణాల పనులు మళ్లీ యథేచ్ఛగా సాగుతున్నాయి. ఇటీవల అక్రమ నిర్మాణాలు నిలిపివేయడంతో పాటు స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్ తీసుకురావాలని ఆదేశిస్తూ మున్సిపల్ కమిషనర్ ఏ.శైలజ సదరు నిర్మాణదారుడికి నోటీసులు జారీచేశారు. అయితే గడువులోపు నిర్మాణదారు ఎలాంటి డాక్యుమెంట్స్ చూప లేదు. దీంతో స్థలంపై ఎలాంటి స్పష్టత లేకపోవడంతో విషయాన్ని కమిషనర్ జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఇదిలా ఉంటే నిర్మాణదారుడు గుట్టుచప్పుడు కాకుండా బుధవారం మళ్లీ పనులు చేపట్టడం గమనార్హం. కమిషనర్ ఆదేశాలు బేఖాతర్ చేస్తూ కాంక్రీట్ మిక్సర్ తెప్పించి కూలీలద్వారా ఫ్లోరింగ్ పనులు దర్జాగా చేపట్టారు. మూడు మడిగెల్లో పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. అక్రమంగా సాగుతున్న పనుల విషయాన్ని 'సాక్షి' మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా వాటికి ఎలాంటి అనుమతులు లేవని, తక్షణమే నిలిపివేయిస్తున్నట్లుగా తెలిపారు. కమిషనర్ ఆదేశాలతో అక్కడికి వెళ్లిన పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు పనులను నిలిపివేయించారు. స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్ చూపించాలని లేకుంటే నిర్మాణాలు కూల్చివేస్తామని హెచ్చరించారు. అయితే పనుల ఆపివేత వరకే ఇది పరిమితమవుతుందా.. హెచ్చరించినట్లుగా అక్రమనిర్మాణాలు కూల్చివేస్తారా అనేది గురువారం వరకు వేచి చూడాల్సిందే.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీల్లో సత్తా



విజేతగా నిలిచిన లక్ష్మణ్

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని తెలంగాణ క్రీడా పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి జూడో క్రీడాకారుడు ఎల్.లక్ష్మణ్ జాతీయ స్థాయిలో మెరిశాడు. రాజస్థాన్ రాష్ట్రంలోని శ్రీగంగానగర్ వేదికగా జరుగుతున్న 67వ జాతీయ ఎస్జీఎఫ్ఐ అండర్ 19 జూడో పోటీల్లో రజత పతకాన్ని సాధించాడు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతూ, ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో జూడో శిక్షణ పొందుతున్నాడని కోచ్ రాజు తెలిపారు. జాతీయస్థాయిలో విజేతగా నిలవడంపై జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి స్వామి అభినందించారు.

జిల్లా క్రీడాకారుడి ప్రతిభ



హిమతేజ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన క్రికెటర్ కె.హిమతేజ బీసీసీఐ కల్నల్ సీకే నాయుడు ట్రోఫీ అండర్-23 పోటీల్లో సత్తా చాటాడు. హైదరాబాద్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న హిమతేజ సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో జరుగుతున్న పోటీల్లో బుధవారం బరోడా జట్టుపైన 299 పరుగులు చేశాడు. ఒక్క పరుగుతో ట్రిపుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. అంతకుముందు కర్ణాటక జట్టుపైన 166 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆయనను జిల్లాకు చెందిన క్రికెటర్లు, అభిమానులు అభినందించారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నిర్మల్‌రూరల్: మండలం కౌట్ల (కే) గ్రామ శివారులోని సరస్వతి కెనాల్‌లో స్నానానికి వెళ్లి గల్లంతైన వ్యక్తి మృతదేహం బుధవారం సాయంత్రం లభ్యమైంది. రూరల్ ఎస్సై చంద్రమోహన్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కంకుడాల భీమన్న(50) ఈ నెల 15న స్నానానికి సరస్వతి కెనాల్‌కు వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతయ్యాడు. కెనాల్‌లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఎస్సారెస్పీ అధికారులతో మాట్లాడి ప్రవాహాన్ని తగ్గించారు. బుధవారం లక్ష్మణచంద మండలం వడ్యాల్ గ్రామ సమీపంలో మృతదేహం లభ్యమైంది. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫర్నిచర్ పట్టివేత

కడెం: మండలంలోని పాండ్వపూర్ అటవీ శాఖ చెక్ పోస్ట్ వద్ద అక్రమంగా ఫర్నిచర్‌ను తరలిస్తున్న బొలేరో వాహనాన్ని పట్టుకున్నట్లు ఎఫ్ఆర్వో చోలే అనిత అన్నారు. ఈ నెల 15న బోథ్ మండలం కుమారి గ్రామం నుంచి ఫర్నిచర్‌ను జన్నారం వైపు తరలిస్తుండగా ఎఫ్‌బీవో ఆలీం, అటవీ సిబ్బంది చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్నారు. పట్టుబడిన ఫర్నిచర్ విలువ పదిహేను వేలు ఉంటుందన్నారు.

ఐఎస్‌ఎల్.. షురూ



మార్చ్‌ఫాస్ట్ నిర్వహిస్తున్న విద్యార్థులు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థులు



క్రీడాపతాకం, బెలూన్లను ఎగురవేస్తున్న ప్రజాప్రతినిధులు

- అట్టహాసంగా రాష్ట్రస్థాయి క్రీడాపోటీలు ప్రారంభం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు
- ఉత్సాహంగా పాల్గొన్న క్రీడాకారులు

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండల కేంద్రంలోని కుమురంభీం ప్రాంగణంలో 7వ ఇంటర్ సొసైటీ స్పోర్ట్స్ లీగ్ 2023–24 రాష్ట్రస్థాయి ఐఎస్ఎల్ క్రీడాపోటీలు బుధవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఎంపీ సోయం బాపూరావు, ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, అనిల్ జాదవ్, మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, మాజీ మంత్రి గోడం నగేశ్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఈఎంఆర్ఎస్ సెక్రటరీ నవీన్ నికోలస్, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో హాజరై క్రీడాపోటీలను ప్రారంభించారు. రాష్ట్రంలోని సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, మైనార్టీ వెల్ఫేర్, ఏకలవ్య మోడల్ పాఠశాలలు, స్టార్, గిరిజన సంక్షేమ గురుకులాలు, ఆశ్రమాల విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. ఒక్కో సొసైటీ నుంచి 219 మంది బాలురు, 193 మంది బాలికల చొప్పున మొత్తం 3,199 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. అంతకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా ఏడు సొసైటీల నుంచి వచ్చిన విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. 200 మంది పీడీలు, రెఫరీలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

800 మీటర్ల పరుగుపందెం బాలుర విభాగంలో ఎంజేపీ సొసైటీకి చెందిన బసంత్ ప్రథమస్థానం, టీఎస్‌డబ్ల్యూఆర్‌కు చెందిన డి.సంతోశ్ ద్వితీయస్థానం, స్టార్స్ సొసైటీకి చెందిన సురేశ్ తృతీయస్థానంలో నిలిచారు. బాలికల విభాగంలో టీడబ్ల్యూఆర్ఎస్ సొసైటీకి చెందిన ఆర్.కీర్తన ప్రథమ స్థానం, బి.మధుప్రియ ద్వితీయస్థానం, టీడబ్ల్యూఆర్ఐఈఎస్‌కు చెందిన నందిని తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలకు గోల్డ్, సిల్వర్ మెడల్స్‌తో పాటు ప్రశంసపత్రాలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ జైవంత్ రావు, డీడీ దిలీప్‌కుమార్, ఏఓ రాంబాబు, ఐటీడీఏ అధికారులు, గురుకులాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న విద్యార్థులు



క్రీడాకారులతో కలిసి అర్చరీ క్రీడలో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఉట్నూర్‌లోనే చదివా..



ఉట్నూర్ లాల్‌టెక్డీలోని ఏపీఆర్‌జేసీ కళాశాలలో ఇంటర్ విద్యను అభ్యసించా. క్రీడోత్సవాల్లో భాగంగా మళ్లీ ఇక్కడికి రావడం ఎంతో ఆనందంగా ఉంది. ఇంతకుముందు ఐఎస్ఎల్ క్రీడాపోటీలు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, సీబీ స్టేడియాల్లో నిర్వహించేవారు. కరోనా కారణంగా రెండేళ్లు పోటీలు నిలిపివేశాం. భద్రాచలం, ఉట్నూర్‌లో 7వ ఐఎస్ఎల్ క్రీడలు నిర్వహిస్తున్నాం. ఈ పోటీలు గురుకులాలకు ఒలింపిక్స్ లాంటివి.

– నర్సింహారెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్

గెలుపోటములు సహజమే



క్రీడల్లో గెలుపోటములు సహజమే. విద్యార్థులంతా కలిసికట్టుగా స్నేహ భావంతో క్రీడాపోటీల్లో పాల్గొనాలి. అన్ని సొసైటీల విద్యార్థులు కలిసి పోటీల్లో పాల్గొనడంతో విద్యార్థుల్లో స్నేహ భావం పెంపొందించుకునేందుకు ఆస్కారం ఉంది. ఇట్టి అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– నవీన్ నికోలస్, ఈఎంఆర్ఎస్ సెక్రటరీ

అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం



ఐఎస్ఎల్ క్రీడా పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. ఎవరికీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవడం జరుగుతోంది. క్రీడలతో పాటు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు క్రీడల్లో అలసిపోకుండా ఉల్లాసంగా గడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

– చాహత్ బాజ్‌పాయ్, ఉట్నూర్ ఐటీడీఏ పీవో

పాఠశాల రోజులు గుర్తుకొచ్చాయ్



గురుకుల పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాలు చూస్తుంటే నేను చిన్నతనంలో పాఠశాలలో చదువుకున్న రోజులు గుర్తుకు వచ్చాయి. క్రీడల్లో గెలుపోటములు సహజం. విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని విజయకేతనం ఎగురవేయాలి.

– గౌస్ ఆలం, ఎస్పీ, ఆదిలాబాద్

ప్రధాని మోదీ హయాంలో క్రీడలకు గుర్తింపు



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హయాంలో దేశంలో క్రీడలకు గుర్తింపు లభించింది. ఒలింపిక్స్, ఏషియన్ క్రీడల్లో ప్రస్తుతం దేశం పతకాలను సాధిస్తుంది. 2016లో ఒలింపిక్స్‌లో నాలుగు పతకాలు, 2018లో ఏషియన్ గేమ్స్‌లో 8 పతకాలు, 2023 ఏషియన్ క్రీడల్లో 103 పతకాలు సాధించిన ఘనత మన దేశానికే చెందుతుంది. ఇదే స్ఫూర్తితో గ్రామీణ విద్యార్థులు సైతం క్రీడల్లో రాణించాలి.

– సోయం బాపూరావు, ఎంపీ

గురుకులంలోనే విద్యను అభ్యసించా..



నా చిన్నతనంలో నేనుకూడా గిరిజన గురుకులాల్లో విద్యను అభ్యసించా. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలి. ఇది వరకు ఉట్నూర్ ఐటీడీఏ ఆదర్శ క్రీడా పాఠశాల విద్యార్థులు భద్రాచలంలో జరిగిన క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్ సాధించడం అభినందనీయం. ఇలాగే క్రీడా స్ఫూర్తిని కొనసాగిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి. గురుకులాల్లో నెలకొన్న సమస్యలు నాదృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తా.

– వెడ్మ బొజ్జు, ఎమ్మెల్యే, ఖానాపూర్

కోచ్‌గా విధులు నిర్వర్తించా..



క్రీడలు అంటే నాకెంతో ఇష్టం. హైదరాబాద్‌లో నేను కూడా కోచ్‌గా విధులు నిర్వర్తించా. ఇలాంటి క్రీడా మైదానాలు బోథ్ నియోజకవర్గంలో సైతం ఏర్పాటు చేసేందుకు అధికారులు కృషి చేయాలి. అక్కడి ప్రాంతం వారికి సైతం క్రీడలపై ఆసక్తి కలిగేలా ఐటీడీఏ పీవో దృష్టి సారించాలి. మాజీ ఎంపీ గోడం నగేశ్ బోథ్‌లో క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం. విద్యార్థులు క్రీడల్లో రాణించాలి.

– అనిల్ జాదవ్, ఎమ్మెల్యే, బోథ్

భూతగాదాలతో రైతు ఆత్మహత్య

- దోషులను శిక్షించాలని మృతదేహంతో నిరసన




మృతదేహంతో బాధిత కుటుంబీకుల నిరసన



ఏలేటి రమణారెడ్డి మృతదేహం

నేరడిగొండ: భూతగాదలతో రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కుమారి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కుమారి గ్రామానికి చెందిన రైతు ఏలేటి రమణారెడ్డి (45) తన వ్యవసాయ భూమికి వెళ్లనివ్వకుండా బానాల రమేష్, బానాల ఉర్మిల, ఏలేటి శ్రీనివాస్‌లు దారిని మూసివేయడంతో పాటు కోర్టులో కేసు వేశారు. అలాగే నోటీసులు పంపించడంతో రైతు మనస్తాపానికి గురయ్యాడు. గ్రామస్తులకు సైతం ఈ విషయం చెప్పినా వారు పట్టించుకోలేదు. దీంతో మనోవేదనకు గురై తన వ్యవసాయ క్షేత్రంలో కారకులైన వారి పేర్లు కాగితంపై రాసి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబీకులు, వారి బంధువులు సూసైడ్ నోట్‌తో ఉన్న బానాల రమేష్ ఇంటి వద్ద మృతదేహంతో నిరసన తెలిపారు. ఏఎస్సై మారుతి సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులను సముదాయించినా వినిపించుకోలేదు. దీంతో ఉట్నూర్ డీఎస్పీ నాగేంద్ర అక్కడికి చేరుకొని గ్రామస్తులతో మాట్లాడారు. ఆందోళనకు దిగడం సరికాదని, సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. అయినప్పటికీ వారు ససేమిరా అంటూ నిరసనను కొనసాగించారు. అయితే బోథ్, సిరికొండ ఎస్సైలు రాము, శ్రీకాంత్‌లతో పాటు 20 మంది స్పెషల్ పార్టీ బలగాలను గ్రామంలో మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా బాధిత కుటుంబ సభ్యులు మాట్లాడుతూ తమ వ్యవసాయ పొలానికి వెళ్లకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. ఆందోళన ఇంకా కొనసాగుతోంది.



సూసైడ్ నోట్

నాగోబా జాతర తైబజార్ వేలం

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా జాతర సందర్భంగా ఏర్పాటు చేసే తైబజార్‌కు అధికారులు బుధవారం కేస్లాపూర్ నాగోబా దర్బార్‌హాల్‌లో వేలం పాట నిర్వహించారు. ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడ్డితో పాటు దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా... తైబజార్ నిర్వాహకును రూ.7లక్షల 25వేలకు గేడం మనోహర్ దక్కించుకున్నారు. జాతరలోని దుకాణ సముదాయాలతో పాటు ఆలయానికి విద్యుత్ సరఫరాకు రూ.లక్షా 28వేలు, ప్యాలాలు, పుట్నాల కోసం రూ.44 వేలు, కొబ్బరి కాయల విక్రయానికి రూ.12వేలకు పలువురు వ్యాపారస్తులు దక్కించుకున్నట్లు దేవాదాయ శాఖ ఈవో రాజమౌళి తెలిపారు. మొత్తం వేలం పాట ద్వారా రూ.9లక్షలా 900 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, సర్పంచ్ రేణుకనాగ్‌నాథ్, గ్రామస్తులు తొడసం సాగర్, ఆనంద్‌రావ్, సంజీవ్, షేకు, షేక్‌నాథ్, చిత్రు, దేవాదాయ శాఖ అధికారులు రమేష్, అరుణ్, వెంకటేశ్వరులు ఉన్నారు.



వేలం నిర్వహిస్తున్న అధికారులు

నాగోబాను దర్శించుకున్న ఎస్పీ

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయంలో జిల్లా ఎస్పీ గౌష్ ఆలం బుధవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మెస్రం వంశీయులు శాలువలతో సన్మానం చేశారు. నాగోబా జాతర, మహాపూజ వివరాలను మెస్రం వంశీయులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. అక్కడి నుండి అమరవీరుల స్తూపాన్ని సందర్శించి వివరాలను స్థానిక ఎస్సై సునీల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ రామకృష్ణ, నాగోబా ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావ్, మెస్రం వంశీయులు బాజీరామ్‌పటేల్, నాగ్‌నాథ్, ఆనంద్‌రావ్, నాగోరావ్, నాగోబా పూజారి మెస్రం షేకు, ఆలయ ఈవో రాజమౌళి ఉన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ గౌష్ ఆలం

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని డాల్డా కంపెనీ ఏరియాకు చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు టు టౌన్ ఎస్సై జీవి.రమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 11గంటల ప్రాంతంలో ఆదిలాబాద్ పట్టణంలో ఉండే తన ఆడపడుచు ఇంటికి వెళ్తానని కుటుంబీకులతో చెప్పి బయలుదేరిన ఆమె రాత్రి వరకు తిరిగి రాలేదు. కుటుంబీకులు చుట్టుపక్కల గాలించిన ఆచూకీ లభించకపోవడంతో బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బేల బైపాస్ రద్దు చేయాలని ఆందోళన



బేలలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బాధిత రైతులు

బేల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం బేల బైపాస్ రద్దు చేయాలని బాధిత రైతులు ఆందోళనకు దిగారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ తమ ప్రాణాలు పోయిన బైపాస్ రోడ్డు కోసం తమ వ్యవసాయ భూములను ఏమాత్రం ఇవ్వమన్నారు. 353బీ నాలుగు లేన్ల జాతీయ రహదారి మార్గంలో మహారాష్ట్రలో ఎక్కడ కూడా బైపాస్ లేదన్నారు. తెలంగాణలో బేల వద్దనే బైపాస్ ఎందుకనీ ప్రశ్నించారు. వ్యాపారులకు కొమ్ము కాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బైపాస్ రోడ్డు రద్దు చేసి రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు. లేకుంటే త్వరలోనే నిరాహార దీక్షలు చేపడుతామని హెచ్చరించారు. తర్వాత మండల తహసీల్దార్ సవాయ్‌సింగ్ వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ కోడే విపిన్, బాధిత రైతులు పాల్గొన్నారు.

సర్వేలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

- తహసీల్దార్‌కు న్యూసాంగ్వి గ్రామస్తుల వినతి

మావల: డీ1 పట్టాల పేరుతో నకిలీ పత్రాలు సృష్టించి భూములు సర్వే చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని న్యూసాంగ్వి గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్‌కు వినతిపత్రం అందించారు. న్యూసాంగ్వి గ్రామం శివారులోని భూముల్లోకి వెళ్లి అనుమతి లేకుండా ప్రైవేటు వ్యక్తులతో నకిలీ డి1 పట్టాల పేరుతో సర్వే చేస్తున్నారని అన్నారు. సర్వే చేస్తున్న ప్రైవేటు సర్వేయర్‌పై, సర్వే చేయించిన వ్యక్తిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు శ్రీనివాస్‌గౌడ్, గంగాధర్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం ఇస్తున్న న్యూసాంగ్వి గ్రామస్తులు

మైనార్టీ గురుకులంలో ప్రవేశాలు

- నేటి నుంచే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు
- 5 నుంచి ఇంటర్ మొదటి ఏడాది వరకు..
- లక్కీడ్రా ద్వారా సీట్ల కేటాయింపు

ఉమ్మడి జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలల వివరాలు

జిల్లా	పాఠశాల/కళాశాలలు
ఆదిలాబాద్	6
నిర్మల్	5
కుమురంభీం	3
మంచిర్యాల	3
మొత్తం	17

మంచిర్యాలటౌన్ : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ మైనార్టీ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలకు మైనార్టీ సంక్షేమ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 2024-25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు ప్రవేశాలకు అవకాశం కల్పించింది. ఈ నెల 18 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా.. ఫిబ్రవరి 6వ తేదీతో గడువు ముగుస్తుంది. నాణ్యమైన విద్య, చక్కటి వసతి, భవితకు మార్గనిర్దేశనం చేసేలా ఏర్పాటు చేసిన మైనార్టీ గురుకులాల్లో బోధన అందిస్తుండగా, ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. దీంతో ప్రతియేటా మైనార్టీ గురుకులాల్లో చేరికకు విద్యార్థుల నుంచి పోటీ ఎక్కువగానే ఉంటోంది. ఆంగ్ల మాధ్యమంలో బోధన సాగుతుండగా, విశాలమైన తరగతి గదులు, విద్యార్థులకు క్రీడలు, యోగ, అన్ని రకాల సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేలా చేయడం, సాయంత్రం వేళల్లో ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నారు.



మంచిర్యాల మైనార్టీ గురుకుల పాఠశాల

ఉమ్మడి జిల్లాలో 17 గురుకులాలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 17 మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలు ఉండగా, అందులో 10 బాలురు, 7 బాలికల కళాశాలలు ఉన్నాయి. www.tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. 5వ తరగతిలో 80 సీట్లు ఉండగా, మిగతా తరగతుల్లో ఉండే ఖాళీ సీట్ల ఆధారంగా కేటాయింపు చేస్తారు. లక్కీడ్రా ద్వారా సీట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతి నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం వరకు ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను నేటి నుంచి స్వీకరిస్తున్నారు. నాణ్యమైన భోజనంతోపాటు ఉత్తమమైన విద్యను అందిస్తున్నాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి లక్కీడ్రా ద్వారా సీట్ల కేటాయిస్తాం. – నీరటి రాజేశ్వరి, మంచిర్యాల జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి

పదవి కోల్పోవడంతోనే విమర్శలు

డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ధ్వజం

కైలాస్‌నగర్: పదవీ, అధికారం కోల్పోవడంతోనే మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న మతిభ్రమించి తనపై తప్పుడు విమర్శలు చేస్తున్నారని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఆరోపించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కంది ప్రజాసేవ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను డబ్బులు తీసుకుని కాంగ్రెస్ పార్టీలో చేరానని వ్యాఖ్యానించడం హాస్యస్పదమన్నారు. జోగు రామన్న రాజకీయాల్లోకొచ్చిందే డబ్బు సంపాదన కోసమని మండిపడ్డారు. రిమ్స్‌లో అడ్డగోలుగా ఉద్యోగాలను అమ్ముకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. ఆయన చరిత్రను ఎపిసోడ్‌ల వారీగా ప్రజల ముందు బయటపెడుతామని తెలిపారు. కంది శ్రీనివాసరెడ్డి నుంచి డబ్బులు తీసుకోలేదని నేను రామన్న స్వగ్రామం దీపాయిగూడలోని హనుమాన్ ఆలయంలో ప్రమాణం చేస్తానని, అందుకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ఏమిలేని తనకు రూ.5, 6 వందల కోట్ల ఆస్తులెక్కడినుండొచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తుమ్మల వెంకట్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్లు జంగుపటేల్, భోజారెడ్డి, మునిగెల విఠల్ ,సయ్యద్ సుజాత్ అలీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

'కేంద్ర ప్రభుత్వ వైఖరి సరికాదు'

ఆదిలాబాద్: ఆదిలాబాద్ – ఆర్మూర్ రైల్వేలైన్ విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరికాదని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ఆదిలాబాద్-ఆర్మూర్ రైల్వే సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు బుధవారం ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వేలైన్ అనేది ఆదిలాబాద్ జిల్లా వాసుల దశాబ్దాల కల అని పేర్కొన్నారు. డీసీసీబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జెడ్పీటీసీ అరుందతి వెంకటరెడ్డి ఉన్నారు.



మద్దతు తెలుపుతున్న కంది శ్రీనివాస్ రెడ్డి